క్లుప్తంగా

గొర్రెల పంపిణీపై అవగాహన

కొత్తూరు: రెండో విడత గొర్రెల పంపిణీపై మండలంలోని ఇన్ముల్‌నర్వలో మంగళవారం మండల పశువైద్యురాలు స్ఫూర్తి గొర్రెల పెంపకందారులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గొర్రెల పంపిణీలో యూనిట్ల వారీగా ప్రభుత్వం లబ్ధిదారులకు ఇస్తున్న సబ్సిడీ.. లబ్ధిదారులకు చెల్లించాల్సిన నగదు మొత్తాల గురించి ఆమె తెలియజేశారు. అంతేకాకుండా గొర్రెల సేకరణలో ఉండే అంశాలు.. కాపరులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శోభ, గొర్రె కాపరుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధవిద్యలతో ఆత్మరక్షణ

కుంగ్ ఫూ మాస్టర్ శివకుమార్‌రెడ్డి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాస్టర్

కొందుర్గు: తమను తాము రక్షించుకునేందుకు విద్యార్థులకు యుద్ధ విద్యలు ఎంతో అవసరమని కుంగ్ ఫూ మాస్టర్ శివకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముట్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు వేసవి ఉచిత కుంగ్ ఫూ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు కుంగ్ ఫూ, కరాటేవంటి విద్యలను నేర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు యుద్ధవిద్యలను సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. అదే విధంగా దేహదారుఢ్యం పెంపొందడంతో పాటుగా చదువుపై ఏకాగ్రత పెరుగుతోందన్నారు. విద్యతో పాటు యుద్ధవిద్యల్లోనూ రాణించాలని అన్నారు. ఉచితంగా నిర్వహిస్తున్న కుంగ్ ఫూ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, మోహన్‌రావు, శ్రీకాంత్, వేణుగోపాల్, రాజు, శ్రీను, సురేష్, అంజియాదవ్, హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే వరకు పోరాటం

బీజేపీ నాయకుడు విజయకుమార్



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే వరకు బీజేపీ నిరుద్యోగుల పక్షాన పోరాడుతుందని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ టంగుటూరి విజయకుమార్ అన్నారు. పాలమూరులో అధ్యక్షుడు బండిసంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌కు షాద్‌నగర్ బీజేపీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా విజయకుమార్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలో రాష్ట్ర మంత్రితో పాటుగా బీఆర్‌ఎస్ ముఖ్యనాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. పాలమూరుకు తరలిన వారిలో అశోక్‌గౌడ్, బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి , న్యూసిటీ శ్రీనివాసాచారి, వంశీకృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, మురళి, అశోక్, నర్సింహ్మయాదవ్, సుధాకర్, నాగరాజు, వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శంకర్‌పల్లి: ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ కేంద్రంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాలల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దీని వల్ల ఈగలు, దోమలు ప్రబలి రోగాల బారిన పడుతారని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ రేవతిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామగ్రామాన గులాబీ జెండా రెపరెపలు

నందిగామ: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన నందిగామతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ జెండాలను ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామాలను గులాబీ జెండాలతో అలంకరించారు. అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ కమిటీల అధ్యక్షుడు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చేవెళ్ల : మినీ ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

రాష్ట్ర అభివృద్ధి దేశానికే ఆదర్శం

- మతతత్వ పార్టీ బీజేపీని మట్టుబెట్టాలి
- ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, కాలె యాదయ్య

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణం సమీపంలోని ఏవీ కన్వెన్షన్ హాలులో మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ ప్లీనరీ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ సహకార కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజావరప్రసాద్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ఇసాక్ హాజరయ్యారు. ప్లీనరీకి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణం గులాబీమయంగా మారింది. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆ పార్టీ జెండాను ఆ విష్కరించారు. అమరువీరుల స్థూపం, తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ ప్లీనరీ సమావేశంలో 20 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనకు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీలు తెలంగాణకు ఏం చేశాయని ప్రశ్నించారు.



కొత్తూరు: ఐక్యత నినాదాలు చేస్తున్న ఎంపీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో దూసుకుపోతోందన్నారు. మతతత్వ బీజేపీని మట్టుపెట్టాలని అన్నారు. అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదాన్ని నిజం చేస్తూ మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కృష్ణయ్య, పరిషత్ వైస్ చైర్మన్ గణేష్, తాండ్రవిశాల శ్రవణ్‌రెడ్డి, కమిటీ చైర్‌పర్సన్ కవితనారాయణయాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటినరేందర్ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొత్తూరు: దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని మండల జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మంగళవారం ఆమె మండలంలోని ఎస్‌బీపల్లిలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అక్కడి ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో అమలు చేస్తుండడం సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనమన్నారు. అభివృద్ధికి ఆకర్శితులవుతున్న అయా రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నట్లు వివరించారు. దేశాభివృద్ధి కోసమే సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను స్థాపించి దేశావ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో..

కొత్తూరు మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ విభాగం అధ్యక్షురాలు కోస్గి భగవద్గీత జెండాను ఆవిష్కరించారు.



కొందుర్గు: జెండాను ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకుడు సయ్యద్ సాధిక్

కేశంపేటలో..

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల అన్నారు. నియోజకవర్గ ప్లీనరీ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో విశాల జెండా విష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, అబ్బి సుందరయ్య పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

చేవెళ్ల: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ స్టేట్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ రూప్నా రవీందన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఈ జాబ్‌మేళాలో అరబిందో ఫార్మా, మెడ్‌ప్లస్, టెలి పెర్ఫార్మెన్స్, టెక్ మహీంద్ర, విప్రో, విజయ ఫెర్టిలైజర్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర సంస్థలు పాల్గొన్నట్లు చెప్పారు. జాబ్‌మేళాకు చేవెళ్ల పరిసర ప్రాంతంలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. మొత్తం 110 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల ఇంటర్వ్యూకు హాజరైనట్లు చెప్పారు. జాబ్ మేళాకు ముందుకు వచ్చిన కంపెనీల ప్రతినిధులను, నిర్వాహకులను పలువురు అభినందించారు. యువత ఇలాంటి వాటిని ఉపయోగించుకొని తమ భవిష్యత్‌ను బాగు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు వైష్ణవి, షేక్ మహబుబ్, రవీందర్, సతీష్‌బాబు, యాదయ్య, రాజు, రాగిణి, స్వర్ణలత, శైలజ, సిబ్బంది ప్రసాద్, చిన్నచెన్నయ్య, పుష్పలత, సునీత, దామోదర్, జామాలుద్దీన్, షఫీ, అభ్యర్థులు తదితరుల ఉన్నారు.



జాబ్‌మేళాలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: మండలంలోని ఎస్‌బీపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వలసలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, సత్యనారాయణ, మెండెకృష్ణ, లింగంనాయక్, మధుసూదన్‌రావు, సురేష్, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురు నాయకులు

షాద్‌నగర్‌టౌన్: ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమణారెడ్డితో పాటు ఆయన అనుచరులు మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యుత్ కార్మికులకు పీఆర్సీ పెంచాలి

టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అధ్యక్షుడు మల్లేశ్

షాద్‌నగర్: విద్యుత్ రంగంలో పని చేస్తున్న ఆర్టిజన్లకు ప్రభుత్వం 50శాతం పీఆర్సీని పెంచాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. ఒక సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ఒకే విధానం అమల్లో ఉండాలని, కానీ, రెండు విధానాలు అమలు చేయడం సరికాదని అన్నారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్న ఆర్టిజన్‌లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయని, ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేస్తూ ఏపీఎస్ఈబీ సర్వీస్ నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులకు రూరల్ పర్సనల్ పే బేసిక్‌లో కలుపుతూ 50శాతం పీఆర్సీని, నూతనంగా నియమించబడిన ఉద్యోగులకు 35శాతం పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్‌లో ఐడీ నంబర్లు ఉన్న కార్మికులందరిని ఆర్టిజన్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. శాంతి యుతంగా సమ్మె చేపడుతున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని అన్నారు. విద్యుత్ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెలో నాయకులు వెంకటేష్, రాజు, వినోద్, కిషన్, ఆంజనేయులు, రఘుపతి, నాగరాజు, మోహన్, మధు, మల్లేష్, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ వద్ద సమ్మె చేస్తున్న ఆర్టిజన్లు

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి



డిమాండ్లను చూపిస్తున్న రేషన్ డీలర్లు

మొయినాబాద్: రేషన్ డీలర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మొయినాబాద్‌లో సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. డీలర్ల జేఏసీ పిలుపు మేరకు పోరాటానికి సిద్ధమవుతున్నామని అన్నారు. ఈ నెల 29న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జేఏసీ సమావేశం జరుగుతుందని.. రేషన్ డీలర్లంతా సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి మోకిల కళావతి, ఉపాధ్యక్షురాలు సుజాతలక్ష్మి, కార్యదర్శి యాదయ్య యాదవ్, కోశాధికారి శివకుమార్, జోసెఫ్, ప్రభులింగం, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిన నాయకులు

కొత్తూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి కొత్తూరు మున్సిపాలిటీ నుంచి పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వేస్తామని ప్రకటిస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహాగౌడ్, రణధీర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, గణేష్, రాఘవులు పాల్గొన్నారు.



నిరుద్యోగ మార్చ్‌కు తరలివెళ్తున్న నాయకులు

'కంటివెలుగు'తో పేదలకు ప్రయోజనం

సర్పంచ్ ఉమ ప్రవీణ్ రెడ్డి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని మోదల్లగూడ సర్పంచ్ ఉమ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోదల్లగూడలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఉమ ప్రవీణ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు కంటి సమస్యలతో ఇబ్బంది బాధపడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం నిపుణులైన కంటి వైద్యులతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తారని వివరించారు. ప్రతి గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మాధవి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, ఉపసర్పంచ్ షఫీ సోఫియా, వార్డు సభ్యులు శ్రీను, అబ్బాస్, రాజు, భాగ్యమ్మ, సునీత, యాదమ్మ, శ్రీరాం, కో ఆప్షన్ సభ్యుడు ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా నాయకుడు దేవేందర్



నిరసన తెలుపుతున్న వీఓఏలు

చేవెళ్ల: వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో వీఓఏల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించిన ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. వీఓఏలు కనీస వేతనాలు లేకుండా చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడిగా కాలం వెల్లదీస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వీఓఏలు వినోద్, విజయ, స్వప్న, శ్రీను, రాణి, స్వరూప, జ్యోతి, అనిత, కవిత, సుజాత, సల్మా, విజయ, తదితరులు ఉన్నారు.

విధులను రద్దు చేయడం అవమానమే

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య

షాద్‌నగర్‌రూరల్: ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాలలో పని చేసేందుకు ఉపాధ్యాయులకు కేటాయించిన విధులను ఎలాంటి సమాచారం లేకుండా రద్దు చేసి వారిని అవమానించారని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య ఆరోపించారు. డీఈఓ తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాలలో ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ విధులను కేటాయించడంతో ఈ నెల 24 ఆయా పాఠశాలలో రిపోర్ట్ చేసి ఆ రోజు కార్యక్రమాలలో పాల్గొనడం జరిగిందన్నారు. 25న పరీక్షా కేంద్రానికి డ్యూటీ కోసం వెళ్లిన ఉపాధ్యాయులకు మీ డ్యూటీలు రద్దు చేశారని, మీ స్థానాలలో ఎస్ఎస్‌సీ స్పాట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు మాత్రమే విధులను కేటాయించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముందు రోజు విధులకు హాజరై ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా వారి స్థానంలో కొత్త వారిని కేటాయించడం ఎగ్జామినేషన్ విధి విధానాలకే విరుద్ధమని అన్నారు. ఇది ఉపాధ్యాయులకు జరిగిన అవమానంగా భావిస్తున్నామన్నారు. ఇకముందు జరిగే పరీక్షలకు స్పాట్ డ్యూటీలు చేసిన వారికే విధులు కేటాయించాలని అన్నారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు, శ్యామలాదేవి, నాయకులు కృష్ణయ్య, రవికుమార్, శేఖర్‌గౌడ్, కృష్ణ, బాలయ్య, లక్ష్మీదేవమ్మ, తావుర్యానాయక్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక అక్కసు

పార్టీ నాయకుడు కంజర్ల ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్, పాండురంగారెడ్డి

చేవెళ్ల: బీజేపీ బలోపేతాన్ని చూసి బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, మండలపార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డిలు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అమిత్‌షా సభ సక్సెస్‌ను బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి తన పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీపై అసత్యపు ఆరోపణలపై మండిపడ్డారు. కేంద్రం ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు, స్వచ్ఛ భారత్, ఆయుష్మాన్‌భారత్, వీధిలైట్లు, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, వైకుంఠధామాలు , సర్వశిక్షా అభియాన్ తదితర వాటికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. అలాగే, బీజేపీ నాయకుల వాల్‌పోస్టర్లు, బ్యానర్ల తొలగింపుపై ర్యాలీ నిర్వహించి ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాండురంగారెడ్డి, సత్యనారాయణ, జిల్లాకార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్‌మోర్చా ఉమాశంకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: 30 సంవత్సరాల తరువాత అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న అల్లం శ్రీనివాస్‌రెడ్డి ఫామ్‌హౌజ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. 1993 సంవత్సరంలో అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అప్పటి 10వ తరగతిలో చదివిన దాదాపు 50 మంది విద్యార్థులు ఫామ్‌హౌజ్‌లో కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి పూర్వ విద్యార్థులలో ప్రస్తుతం అజీజ్‌నగర్ ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్‌రెడ్డి, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ముద్దం రాము, తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతి రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మత్స్యకారుల రాష్ట్ర కార్యదర్శి నారాయణపురం మహేందర్ ముదిరాజ్, హిమాయత్‌సాగర్ మాజీ సర్పంచ్ వడ్డె ఆంజనేయులు, పీరంచెరువు మాజీ ఉపసర్పంచ్ కృష్ణయాదవ్, పూర్వ విద్యార్థులు ఉమాదేవి, సంగీత రెడ్డి, చంద్రకళారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న అప్పటి పీటీ ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు.